నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 6 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

అమ్మవార్లకు అభిషేకాలు

కోటపల్లి, జనవరి 5 : కోటపల్లి మండలం సూపాకలో ఆదివారం మారెమ్మ, లక్ష్మీదేవి బోనాలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ కాశెట్టి సతీశ్, ఉప సర్పంచ్ గట్టు వెంకటమ్మ తెలిపారు. బోనాల సందర్భంగా అమ్మవార్లకు శుక్రవారం ప్రాణహిత నదిలో అభిషేకాలు నిర్వహించారు. శనివారం రాగి బోనం, ఆదివారం బోనాల సమర్పణ కార్యక్రమం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు.

అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించేందుకు ప్రాణహిత నదికి తీసుకువచ్చిన భక్తులు

జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

రెబ్బెన, జనవరి 5 : మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఈ నెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన క్రీడాకారిణులు ఆత్రం స్వప్న, రిక్కల విష్ణుప్రియ ఎంపికైనట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.నారాయణరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ రాష్ట్ర మహిళా జట్టు కెప్టెన్‌గా ఆత్రం స్వప్న వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను వివిధ సంఘాల ప్రతినిధులు నర్సింగం, ఎస్.తిరుపతి, భాస్కర్, ఆర్.శ్రీనివాసరెడ్డి, మహేందర్‌రెడ్డి, మారిన వెంకటేశ్వర్లు, శంకర్, సీనియర్ క్రీడాకారులు లక్ష్మణ్, సాంబయ్య, సదానందం, లింగరెడ్డి, హరిలాల్, మల్లేశ్, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి, రెడ్డి సతీశ్, తౌఫీక్, సతీశ్, చిన్ని అభినందనలు తెలిపారు.

ఆత్రం స్వప్న

రిక్కల విష్ణుప్రియ

డ్రాగన్ ఫ్రూట్.. లాభాలు ఫుల్

దేవునిగూడలో సాగుకు శ్రీకారం చుట్టిన సోదరులు

- ఎకరంలో 2 వేల మొక్కల పెంపకం
- మరో మూడు నెలల్లో పంట చేతికి..
- మార్కెట్‌లో కిలోకు రూ. 150 వరకు ధర
- ఒక్కసారి పెట్టుబడి పెడితే.. 20 ఏండ్ల దాకా ఆదాయం

దేవునిగూడలో డ్రాగన్ ఫ్రూట్ తోట

మొక్కను కత్తిరిస్తున్న సాయికృష్ణారెడ్డి

ఆ అన్నదమ్ములిద్దరూ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న డ్రాగన్ ఫ్రూట్ సాగుకు శ్రీకారం చుట్టారు. తమకున్న ఎకరంలో 2 వేల మొక్కలు నాటగా, మరో మూడు నెలల్లో పంట చేతికందనున్నది. 2 టన్నుల దిగుబడి రానుండగా, రూ. 3 లక్షల దాకా ఆదాయం వస్తుందని ఆ యువరైతులిద్దరూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- జన్నారం, జనవరి 5

దేవునిగూడ గ్రామానికి చెందిన కల్లెం రవీందర్‌రెడ్డి–జమున దంపతులకు ఇద్దరు కుమారులు శివకృష్ణారెడ్డి, సాయికృష్ణారెడ్డి. వీరి చిన్నతనంలోనే తండ్రి చనిపోగా.. తల్లే కష్టపడి పెంచింది. ఇద్దరినీ డిగ్రీ వరకు చదివించింది. సాయికృష్ణారెడ్డి హాంకాంగ్ దేశంలో ఉద్యోగం చేస్తున్నాడు. వీలున్నప్పుడుల్లా ఇక్కడికి వచ్చి తమ్ముడు శివకృష్ణారెడ్డితో కలిసి వ్యవసాయం చేస్తుంటాడు. ఇద్దరు కలిసి తమకున్న 8 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

మరో ఎకరంలో డ్రాగన్‌ఫ్రూట్..

మార్కెట్‌లో డ్రాగన్‌ఫ్రూట్‌కు డిమాండ్ ఉండగా, మరో ఎకరంలో ఆ పంట వేయాలని నిర్ణయించుకున్నారు. ఇంకేముంది జగిత్యాల జిల్లా అంతర్‌గాం గ్రామానికి వెళ్లి నర్సరీలో 2 వేల మొక్కలను కొనుగోలు చేశారు. ఒక్కో మొక్కకు రూ. 80 చొప్పున చెల్లించారు. 2022–డిసెంబర్‌లో మొక్కలు నాటారు. అంతకుముందే కరీంనగర్‌కు వెళ్లి 512 సిమెంట్ పోల్స్‌ను తీసుకొచ్చారు. ఒక్కో పోల్‌కు రూ.500 ఖర్చు చేశారు. పాతిన ప్రతి పోల్‌కు నాలుగు డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను ఏర్పాటు చేశారు. మరో రూ. 50 వేలతో డ్రిప్ ఏర్పాటు చేసి.. వాటికి నీరందిస్తున్నారు. ఇటీవల మొక్కలు ఏపుగా పెరిగి కాయలు కూడా పడ్డాయి. అయితే మొదటి (6 నుంచి 8 నెలలు మధ్య) పంట నాణ్యతగా ఉండదు కాబట్టి.. కాయలన్నీ కోసివేశారు. మరో 3 నెలల్లో పంట చేతికి వచ్చే అవకాశమున్నది.

తోటలో పూసిన డ్రాగన్ ఫ్రూట్ పువ్వు

ఎకరంలో 2 టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలోకు రూ. 150 వరకు ధర పలుకుతుంది. ఈ లెక్కన రూ. 3 లక్షల వరకు ఆదాయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలకోసారి దిగుబడి వస్తుందని, మొక్కలు నాటినప్పటి నుంచి 20 ఏండ్ల దాకా ఆదాయం పొందవచ్చని అన్నదమ్ములు పేర్కొంటున్నారు. పంట పెట్టుబడి కోసం రూ. 6 లక్షల దాకా ఖర్చు చేశామని, ఆశించిన విధంగా పంట పండితే రెండేళ్లలో పెట్టుబడి డబ్బులు తిరిగొస్తాయని వారు చెబుతున్నారు.

సబ్సిడీ అందించాలి

డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసేటప్పుడు మొదట్లో పెట్టుబడి రూ. లక్షల్లో ఉంటుంది. అందుకే ప్రభుత్వం సబ్సిడీ అందించి రైతులను ప్రోత్సహించాలి. మాకు 9 ఎకరాల భూమి ఉంది. 8 ఎకరాల్లో వరి వేస్తున్నం. మరో ఎకరంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నం. ఈ పంట లాభదాయకమైనది. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఆరు నెలలకోసారి దిగుబడి వస్తుంది. ఒక్కసారి పంట వేస్తే 20 ఏండ్ల దాకా ఆదాయం పొందే వీలుంటుంది.

- కల్లెం శివకృష్ణారెడ్డి, దేవునిగూడ

రెండు పంటల్లో పెట్టుబడి తిరిగొస్తుంది

పామాయిల్ సాగుకు ఎలాగైతే ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందో డ్రాగన్ ఫ్రూట్ సాగుకు కూడా సబ్సిడీ ఇవ్వాలి. అప్పుడు అనేక మంది రైతులు వినూత్న పంటల సాగుకు ముందుకు వస్తారు. ఎప్పుడూ ఒకేరకమైన పంటలు పండించి నష్టపోయేకన్నా.. పండ్ల సాగుపై ఆసక్తి చూపితే బాగుంటుందనేది నా అభిప్రాయం. అందుకే ప్రయోగాత్మకంగా మేము ఎకరంలో డ్రాగన్ ఫ్రూట్ వేశాం. పంట మంచిగనే ఉంది. మరో మూడు నెలల్లో దిగుబడి వస్తుంది. మేము రూ. 6 లక్షల దాకా పెట్టుబడి పెట్టాం. రెండు పంటల్లో పెట్టుబడికి పెట్టిన డబ్బులు తిరిగి వస్తాయనుకుంటున్నం. మిగతా 20 ఏండ్ల దాకా ఆదాయం మిగులుతుంది.

- కల్లెం సాయికృష్ణారెడ్డి, దేవునిగూడెం

కొత్త ఓటరు జాబితాకు కసరత్తు

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారుల నిమగ్నం

- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అవగాహన
- ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా మరిన్ని పెరుగనున్న పోలింగ్ కేంద్రాలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు జిల్లా అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు బూత్ స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల నాయకుల సహకారంతో తప్పుల్లేని కొత్త ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు కసరత్తు మొదలుపెట్టారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అవగాహన కల్పిస్తున్నారు. పెరిగే ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో మరిన్ని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయానికి ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో 4,53,538 మంది ఓటర్లు ఉన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 305, సిర్పూర్ నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. తాజాగా.. ఓటర్ల జాబితా సవరిస్తుండగా, ఓటర్ల సంఖ్యతో పాటు మరిన్ని పోలింగ్ కేంద్రాలు పెరగనున్నాయి. ఆసిఫాబాద్‌లో కొత్తగా 52 పోలింగ్ కేంద్రాలు, సిర్పూర్ నియోజకవర్గంలో మరో 27 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశమున్నది. జిల్లాలో ప్రస్తుతం 599 కేంద్రాలుండగా, కొత్త వాటితో కలిపి మొత్తం 678 కేంద్రాలు ఏర్పడనున్నాయి. ప్రతి రెండు కిలోమీటర్ల పరిధిలో పోలింగ్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రెండు కిలోమీటర్ల పరిధి దాటి ఉన్న ఓటర్లను గుర్తించి.. ఫారం 8 ద్వారా ఓటర్ల జాబితా సవరించనున్నారు. ఈ నెల 20, 21వ తేదీల్లో కొత్త పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించనున్నారు. ఈ విషయమై ఇప్పటికే కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్ రావు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందుకోసం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు కొత్త ఓటర్ల జాబితాపై దృష్టిసారించిన అధికారులు కొత్త ఓటర్ల జాబితా తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇక పార్లమెంట్ ఎన్నికలకు రాజకీయ పార్టీలు కూడా సమాయత్తమవుతున్నాయి. ఓటర్ల జాబితాల సరవణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు తదితర విషయాలపై అధికారులు నాయకులు, ముఖ్యకార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు అటు అధికార యంత్రాంగం ఇటు రాజకీయ పార్టీలు సంసిద్ధం అవుతున్నాయి.

పారపాట్లు లేకుండా ఆన్‌లైన్ చేయాలి

కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

ఆసిఫాబాద్,జనవరి 5 : ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించి.. పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదుపై డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తుదారుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మొబైల్ నంబర్లతో పాటు దరఖాస్తుదారుడు నింపిన సమాచారాన్ని మాత్రమే అప్ లోడ్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ సహదేవరావు

నేడు గూడెం ఎత్తిపోతల నీటి విడుదల

దండేపల్లి, జనవరి 5 : గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఎత్తిపోతల పథకం నుంచి నేడు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు నీటిని విడుదల చేయనున్నారు. గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా యేటా 30 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ఎల్లంపెల్లి జలాశయ నిల్వ నీటిని(బ్యాక్ వాటర్)గూడెం సమీపంలోని గోదావరి తీరాన నిర్మించిన ఎత్తిపోతల పథకం ద్వారా యాసంగికి నీటిని అందిస్తున్నారు. గూడెం ఎత్తిపోతల పథకం నీటిని తానిమడుగు సమీపంలోని కడెం ప్రధాన కాల్వలో 30వ డిస్ట్రిబ్యూటరీ వద్ద ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి 42 కాల్వ వరకు దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల పరిధిలోని 30 వేల ఎకరాలకు సాగు నీరు అందనున్నది.

ఎన్‌హెచ్-63 సర్వేను అడ్డుకున్న బాధితులు

హాజీపూర్, జనవరి 5 : మండలంలోని ముల్కల్ల గ్రామ శివారులో మంచిర్యాల – ఆర్మూర్ ఎన్‌హెచ్–63 సర్వేను శుక్రవారం భూ బాధితులు అడ్డుకున్నారు. 2018లో చేసిన సర్వే ప్రకారం కాకుండా కొత్తగా తమకు ఎలాంటి నోటీస్‌లు ఇవ్వకుండా సర్వే చేయడం ఏమిటని సర్వే సిబ్బందిని వారు ప్రశ్నించారు. గతంలో నిర్వహించిన సర్వే ఆధారంగానే జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సర్వేను అడ్డుకున్న వారిలో వొడ్నాల శ్యామ్ సుందర్, బొల్లం భీమయ్య, తదితరులు ఉన్నారు.

సర్వేను అడ్డుకున్న భూ బాధితులు

8న శ్రీరాంపూర్ ఐటీఐలో అప్రెంటిషిప్ మేళా

శ్రీరాంపూర్, జనవరి 5 : ఈ నెల 8న శ్రీరాంపూర్ కాలనీలోని ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిషిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం. చందర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అప్రెంటిషిప్ మేళాకు పలు కంపెనీల యాజమాన్యాలు హాజరవుతాయని, స్కెండర్ ఎలక్ట్రికల్, ఆదర్శ మారుతి, జీఎంఆర్, వరలక్ష్మీ ఫౌండేషన్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు క్యాంపస్ సంస్థల్లో ఖాళీగా ఉన్న అప్రెంటిషిప్‌ల భర్తీకి మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, డిజిల్ మెకానిక్, కోపా, ఎలక్ట్రానిక్స్, మెకానిక్స్ ట్రేడర్స్ విద్యార్థులు (2023 లో పాసైన) ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అప్రెంటిషిప్ మేళాకు హాజరయ్యే విద్యార్థులు apprenticeshipinindia.gov.in లో నమోదు చేసుకోవాలని, మేళాకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని కోరారు.

గోలేటి గ్రామంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

కనుల పండువగా శ్రీరాముని

అక్షింతల శోభాయాత్ర

రెబ్బెన, జనవరి 5 : గోలేటి గ్రామ పంచాయతీలో అయోధ్య రామ మందిర తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీరాముని అక్షింతలు, శ్రీరాముని ప్రతిమల శోభాయాత్ర శుక్రవారం కనుల పండువగా సాగింది. గోలేటిలోని హనుమాన్ మందిరం నుంచి గోలేటిటౌన్‌షిప్ కార్మిక కాలనీలో గల కోదండ రామాలయం వరకు సాగింది. మహిళలు మంగళ హారతులతో తరలివచ్చారు. పూజలు నిర్వహించి శ్రీరాముని అక్షింతలు తీసుకున్నారు. 22న అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా భక్తులంతా తమ ఇండ్ల వద్ద 5 దీపాలు వెలిగించి కోదండ ఆలయానికి రావాలని అర్చకుడు సంతోష్ శర్మ పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్, ఎస్‌వోటు జీఎం మచ్చగిరి నరేందర్ ప్రత్యేక పూజలు చేసి.. అక్షింతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గోలేటి గ్రామ సర్పంచ్ పొటు సుమలత, మాజీ సర్పంచ్ సోల్లు లక్ష్మి, మాజీ ఎంపీటీసీ సురేందర్‌రాజు, మాజీ ఉపసర్పంచ్ రవినాయక్, ఆలయ మాజీ కార్యదర్శి సంగెం ప్రకాశ్‌రావు, మాజీ కోశాధికారి దాసరి సాంబగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొటు శ్రీధర్‌రెడ్డి, బీజేపీ అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్, తీర్థ క్షేత్ర ట్రస్ట్ గోలేటి కార్యదర్శి సంతోష్‌శర్మ, సహ సంయోజక్ విజయ్ కుమార్, సభ్యులు గోలెం విలాస్, పత్తెం రాజు, పోతురాజుల భీమేశ్, పంబాల శ్రీనివాస్, పరికి పండ్ల సత్యనారాయణ, కేసరి కిషన్‌గౌడ్, లింగమూర్తి, జటంగుల సంజయ్, శ్రీరాం, రాజశేఖర్, సంతోశ్, సతీశ్, శ్రీకాంత్ ఉన్నారు.

శోభాయాత్రలో నృత్యం చేస్తున్న గోలేటి సర్పంచ్ పొటు సుమలత

దరఖాస్తులను పరిశీలించి

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు
- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, జనవరి 5 : ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించి.. ఈ నెల 17వ తేదీలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాహుల్, డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి నరేందర్‌తో కలిసి తహసీల్దార్‌లు, మున్సిపల్ అధికారులు, ఎంపీడీవోలు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. వార్డుల వారీగా దరఖాస్తు సంఖ్య నమోదు చేయాలని, కులం, పుట్టిన తేదీ,ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, మొబైల్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలను తప్పుల్లేకుండా నమోదు చేయాలని సూచించారు. డాటా ఎంట్రీ సమయంలో ఏవైనా ఇబ్బందులుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. మున్సిపాలిటీలు, మండలాల్లో అందుబాటులో ఉన్న వివిధ శాఖలకు చెందిన ఆపరేటర్ల వివరాలు సేకరించాలని, నమోదు కార్యక్రమానికి అనుగుణంగా ఆపరేటర్లకు విధులు కేటాయించాలన్నారు. కంప్యూటర్‌లు, ఇంటర్నెట్, విద్యుత్ సౌకర్యాలు కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. విధులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మాదక ద్రవ్యాల నివారణకు పకడ్బందీ చర్యలు

బెల్లంపల్లి ఏసీపీ సదయ్య

బెల్లంపల్లిరూరల్, జనవరి 5 : మాదక ద్రవ్యాల నివారణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పద్మశాలీ భవన్‌లో బెల్లంపల్లి పోలీస్ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత గంజాయికి అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. యువత ఖాళీగా ఉండడం వల్లే అనేక వ్యసనాలకు అలవాటు పడిపోతున్నారని చెప్పారు. యువత చదువుపై దృష్టి సారించాలని, సమయం దొరికితే మంచి స్నేహితులను కలుస్తూ సమాజంపై అవగాహన పెంచుకోవాలన్నారు. క్రీడలకు తగిన ప్రాధాన్యతనిస్తూ ఉద్యోగాల కోసం ప్రయత్నించాలని సూచించారు. ఎక్కడైనా గంజాయి, మత్తు పదార్థాలు అమ్మితే తమకు సమాచారమందించాలని కోరారు. బెల్లంపల్లిరూరల్, మందమర్రి సీఐలు రాజ్ కుమార్‌గౌడ్, మహేందర్‌రెడ్డితో పాటు సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏసీపీ సదయ్య

70 మిలియన్ టన్నుల

బొగ్గు ఉత్పత్తి సాధించాలి

- లక్ష్య సాధనకు అంకితభావంతో పనిచేయాలి
- రోజుకు 15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించండి
- సింగరేణి సీఎండీ బలరాం
- జీఎంలు, డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్

శ్రీరాంపూర్, జనవరి 5 : సింగరేణి సంస్థ నిర్దేశించిన 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధనకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఅండ్ఎండీ) ఎన్ బలరాం పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి జీఎంలు, డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణిని దేశంలోనే అగ్రస్థాయి కంపెనీగా నిలిపేందుకు ప్రతి ఉద్యోగీ తమవంతు బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుందని చెప్పారు. దేశ ఇంధన అవసరాలకనుగుణంగా, రానున్న వేసవి నేపథ్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల వద్ద 21 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉంచాలని, ఇందుకోసం ప్రతి రోజూ 2.24 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని కోరారు. రోజుకు 15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని ఆదేశించారు. ఆడ్రియాలా లాంగ్‌వాల్ ప్రాజెక్టు సహా కంటీన్యూయస్ మైనర్లు, సీహెచ్‌పీలపై సమీక్షించారు. ఉత్పత్తి, ఉత్పాదకతపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది మొదటి 9 నెలల్లో బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపు అశాజనకంగా ఉన్నాయన్నారు. బొగ్గు ఉత్పత్తి 5.15 శాతం వృద్ధితో 49.66 మిలియన్ టన్నులు, రవాణాలో 8 శాతం వృద్ధితో 51 మిలియన్ టన్నులు, ఓవర్ బర్డెన్ తొలగింపులో 6 శాతం వృద్ధితో 306.6 మిలియన్ క్యూబిక్ మీటర్ల మేర లక్ష్యాలను సాధించినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రానున్న 3 నెలల్లోనూ సమష్టిగా లక్ష్య సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన ప్రాజెక్టులను ప్రారంభించడంలో ఎదురవుతున్న అవాంతరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి భూసేకరణ, ఇతర అనుమతులపై ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. ఒడిశాలోని నైనీ బ్లాక్‌లో సాధ్యమైనంత త్వరగా ఉత్పత్తిని ప్రారంభించేందుకు ఆ రాష్ట్ర ఉన్నతాధికారులతో మాట్లాడుతామన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడుతామని చెప్పారని తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు సత్యనారాయణ, ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, ఈడీ జే అల్విన్, జీఎం సురేశ్, జక్కం రమేశ్, సుబ్బారావు, దేవేందర్, సూర్యనారాయణ, శ్రీరాంపూర్ నుంచి జీఎం సంజీవరెడ్డి, రీజియన్ సేఫ్టీ జీఎం కే హరినారాయణగుప్తా, ఎస్‌వోటు జీఎం రఘుకుమార్, ఏజీఎం మురళీధర్, డీవైజీఎం అరవిందరావు, చిరంజీవులు, రాముడు, సర్వే ఆఫీసర్ వెంకటేశం, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

డైరెక్టర్లు, జీఎంల సమావేశంలో మాట్లాడుతున్న సీఅండ్ఎండీ బలరామ్